# నూజవీడు సంస్థాన సంగ్రహచరిత్రము

వైద్యుల కృష్ణారావు పంతులుగారు

నూజవీడు సంస్థాన ముత్తరసర్కారులలోఁ జాలఁ బ్రఖ్యాతి గల జమీందారీలలో నొకటై యున్నది. ప్రథమ మం దీ సంస్థానములో దాదాపుగఁ గృష్ణాగోదావరీమధ్యమున నుండు దేశ మంతయుఁ జేరియుండెను. ఇది దాదాపుగ నాలుగు వందల సంవత్సరముల క్రిందఁ బద్మనాయకవీరులచే స్థాపింపఁబడి వారి సంతతి వారిచే నిప్పటికిని బాలింపఁబడుచున్నది. వీరి యాదిపురుషుఁడు సేకా బసవన్నగారను వెలమశూరుఁడై యుండెను. దక్షిణహిందూదేశ మంతయు నరాజకముగా నుండుటచే ధైర్యసాహసములు గల వీరుఁడు వెడలి రాజ్యము స్థాపించుట కవకాశము కలిగియుండు కాలములో నీ వీరుఁడు ప్రబలి కృష్ణానది కుత్తరదిశ నుండు "గొల్లపల్లి" పురమున నొక కోట కట్టి రాజ్యాంకురమును నాటెను. ఈ కాలమందు జగత్ప్రసిద్ధి గాంచిన కృష్ణదేవరాయలు విజయనగరరాష్ట్రమందును శూరాగ్రేసరుఁ డగు కుటుబ్‌షా సుల్తాను గోలకొండయందును బరిపాలన మొనర్చుచుండిరి. బసవన్నగారి మునిమనుమలు కోనప్పగారు; వారిద్వితీయపుత్రు లగు వేంకటాద్రిగారు క్రీ.శ.1652-వ సంవత్సరమున గొల్లపల్లి పరగణాను సంపాదించెను. వీరి కుమారులు అప్పన్నగారను విజయఅప్పారావుగారు అసమాన పరాక్రమవంతులు. విశేషధైర్యసాహససంపన్నులై, రణరంగమందు అనుపమఖ్యాతి గాంచి గోలుకొండ నవాబువారి మెప్పు వడసెను. ఇట్టి వీరాగ్రేసరునికి నవాబుగారు 'తహావరు, వజులాలతు, దస్తగహా' అను బిరుదముల నొసంగి నౌబతు నగారా నుంచుకొనుటకును బంగారపుటంచు గల జాలరుపల్లకీ నెక్కుటకును నధికారము నిచ్చిరి. మరియు "రాజా", "బహద్దరు", "అప్పారావు" అను బిరుదుల నొసఁగిరి. ఈ శూరాగ్రణి మొదలు "అప్పారావు" అను పౌరుషనామమే వీరి గృహనామముగా వాడఁబడుచున్నది. వీరి కుటుంబములో ప్రతిపురుషుని నామమునకు అప్పారాయాహ్వయము మకుటమణిగ విరాజిల్లుచున్నది. ఈ విజయ అప్పారావుగారే నూజవీడునొద్ద కోటను గట్టించి ఆపురమును రాజధానిగ నేర్పఱిచినవారు. నూజవీడు అను పేరు వచ్చుట కొక కథ కలదు. విజయఅప్పరావుగారు వేఁటకు వచ్చియుండఁగ నూజవీడుపురము కట్టిన స్థలమున నొక మేఁక తోఁడేలును ధైర్యముతో నెదిరించుటను చూచి, అది బహుశౌర్యరేఖాకర మగు స్థలమని యెంచి, అచ్చట కోటను గట్టించి పట్టణము నేర్పఱిచిరి. కోట గట్టిన ప్రదేశము నువ్వులచేను అగుటచేత నూజవీడు అని పేరు వచ్చుటకు కారణమైనది. వీరి కుమారులు వేంకటాద్రి అప్పారావుగారు. వారు మూడుపరగణాలుఉపరిగ సంపాదించిరి. వీరికి నరసింహ అప్పారావు, శోభనాద్రిఅప్పారావు అను పుత్రు లిరువురు గలిగిరి. వీరి కాలములో నీ సంస్థానము మహోన్నతదశయం దుండె నని చెప్పవచ్చును. నరసింహ అప్పారావుగారు విశేషప్రసిద్ధి గాంచిరి. వారికి, మూడు వేల మంది భటులను యుద్ధసమయమందు హాజరుపెట్టవలసిన షరతు గలిగి యుండుటచే "తీన్ హజారు మనసబుదా" రను బిరుదమును హైదరాబాదు నవాబుగారొసఁగిరి. నూజవీడు సంస్థానాధిపతులుగ ప్రప్రథమమున గౌరవింపఁబడినవారు వీరే. వీరే "ఇందుమతీపరిణయ" మను గ్రంథమును కృతినొందిరి. వీరి తమ్ములగు శోభనాద్రి అప్పారావు బహద్దరుగారి కాలములో నీ దిగువఁ జెప్పఁబడిన పదునెనిమిది పరగణాలు వీరి యాధిపత్యములో చేరినవిగా నుండెను.

| | |
|---|---|
| 1. గుండుగొలను. | 10. విజయరాయి. |
| 2. పెంటపాడు. | 11. గొల్లపల్లి. |
| 3. నిడుదవోలు. | 12. గుడివాడ. |
| 4. బహారుజల్లీ. | 13. కలిదిండి. |
| 5. ఏలూరుహవేలీ. | 14. చిన్నకోట. |
| 6. వుయ్యూరు. | 15. బత్తరుజల్లీ. |
| 7. మేడూరు. | 16. రాయగుడి. |
| 8. నున్నస్థలం. | 17. కుదికొండ. |
| 9. చట్రాయి. | 18. కపిలవాయి. |

మొదటి తొమ్మిదియు ఏలూరు సర్కారులోనివి. తక్కినవి కొండపల్లి సర్కారులోనివి.

శోభనాద్రి అప్పారావుగారి శత్రువు లగు నూరానేనివారు కొంతమంది జ్ఞాతులను పురస్కరించుకొని వచ్చి అగిరిపల్లివద్ద గొప్ప యుద్ధము చేసి రనియు, అప్పారావుగారు అసమానశూరత్వము చూపి జయము పొంది రనియుఁ జెప్పెదరు.

ఈ సహోదరు లిరువురకు సంతు లేనందున వీరి జ్ఞాతు లగు అప్పన అప్పారావుగారికిని వారి యనంతరము వారి పినతండ్రి కుమారు లగు రామచంద్ర అప్పారావుగారికిని రాజ్యము సంక్రమించెను. రామచంద్ర అప్పారావుగారు రాజ్యమేలుచుండఁగ హైదరాబాదు నవాబగు "నైజాముల్ ములుకు" గారు కర్ణాటకపు దేశముమీఁదికి దండయాత్ర వెడలెను. అప్పుడు వీరు లోఁబడనందున మూడు మాసములు నూజవీడుకోట ముట్టడివేయఁబడెను. తుదకు నైజామువారి సేనాధిపతి యగు రుస్తు మల్లీఖాను కోట పట్టుకొని రామచంద్ర అప్పారావుగారిని సంహరించెను. అటుపిమ్మట ఈ సంస్థానమును రుస్తు మల్లీఖాను స్వయముగాఁ బన్నెండు సంవత్సరములు వ్యవహరించెను. కాని ఖానునవంతరము వచ్చిన ఉద్యోగి అప్పారావుప్రభువుల యాశ్రితు లగు కమదన అప్పన్న రాయన్న గార్లను ఈ సంస్థానపు సిస్తులను వసూలుచేసి వ్యవహరించునట్లుగ నేర్పాటుచేసెను. ఇట్టి ప్రవేశము